క్లుప్తంగా

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

రంగంపేట: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరిగాయన్నారు. చివరిరోజు సోషల్ పరీక్షకు 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యాని తెలిపారు. మూడు కేంద్రాల్లోను మొత్తంగా 617 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 598 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికార్లు, వైద్య, పోలీసు సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సర్వర్ పనిచేయక ఖాతాదారుల ఇక్కట్లు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు యూనియన్ బ్యాంకు వద్ద సర్వర్ పనిచేయకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచి సర్వర్ మొరాయించడంతో ప్రధానంగా బిక్కవోలు, ఇల్లపల్లి, ఇలపల్లి పాకలు, తుమ్మలపల్లి, రంగాపురం గ్రామాల నుంచి వచ్చిన డ్వాక్రా గ్రూపుల సభ్యులు గంటల తరబడి ఎదురుచూసి వెనుదిరిగారు. మధ్యాహ్నం తరువాత సర్వర్‌ను పునరుద్ధరించడంతో అప్పటివరకూ వేచి ఉన్న వారికి కాసింత ఉపశమనం లభించింది.

తొమ్మిది గ్రామాల్లో నూరు శాతం వసూళ్లు

పెదపూడి: మండలంలోని 9 గ్రామాల్లో నూరు శాతం పన్నుల వసూళ్లు జరిగాయని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పెదపూడిలో మాట్లాడుతూ మండలంలోని మొత్తం 18 గ్రామాల్లో రూ.1,39,81,807 వసూలు చేయాల్సి ఉండగా రూ.1,25,83,062 వసూళ్లు జరిగాయన్నారు. రామేశ్వరం, చింతపల్లి, దోమాడ, గండ్రేడు, కైకవోలు, కరకుదురు, కుమారప్రియం, పైన, రాజుపాలెం గ్రామాల్లో నూరు శాతం పన్నులు వసూలు చేశారన్నారు. ఆయా గ్రామాల సచివాలయ కార్యదర్శులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మిగిలిన తొమ్మిది గ్రామాల్లో పన్నుల వసూళ్ల వేగవంతం చేయాలని సూచించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: నామవరంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్టు మంజూరు చేసిన రూ.10 లక్షల నిధులు, ప్రజా విరాళాలతో నిర్మించిన ఇదే ఆలయంలో సూర్య దేవాలయం, సాయిబాబా ఆలయాలను ఉప ఆలయాలుగా నిర్మించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని, స్వామి వార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు బుల్లి గోవిందు, నక్క శ్రీను, అక్కి శ్రీను, తాడి శ్రీనివాసరెడ్డి, బుల్లి అనంత లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వంగలపూడి ఏటిగట్టుపై వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మధుబాబు

సీతానగరం: వంగలపూడి గ్రామం వద్ద వాహనాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బుధవారం సీతానగరం–పురుషోత్తపట్నం ఏటిగట్టు రోడ్డులో వంగలపూడి వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కాశీ మధుబాబు, కానిస్టేబుల్ కె.వినోద్ కుమార్ వాహనాలను క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ రూ.49,999 వరకు నగదు తీసుకొని వెళ్లవచ్చని, రూ.50 వేలు పైబడి నగదు ఉంటే ఆధారాలు చూపాలన్నారు. అలాగే రూ.10 వేలు పైబడి విలువ గల ఆర్టికల్స్ కొనుగోలు చేసినట్టయితే తగిన ఆధారాలు చూపాలన్నారు. ఓటర్లను ప్రలోబపెట్టే ఏవిధమైనా సామగ్రి, నగదును తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో వీడియోగ్రాఫర్ సతీష్ పాల్గొన్నారు.

న్యాయ సేవలపై సదస్సు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలతో న్యాయమూర్తి కె.ప్రత్యూషకుమారి బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రీ, అరెస్టు, అరెస్టు, రిమాండ్ దశల్లో అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, పోక్సో చట్టం 2012, ఆంధ్ర ప్రదేశ్ విక్టిమ్ కాంపెన్సేషన్ స్కీమ్ 2015, లైంగిక వేధింపులు, ఇతర నేరాల బాధితులకు నల్సా పరిహార పథకం 2018 అంశాలపై అవగాహన కల్పించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల పనితీరుపై పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ లాయర్లతో చర్చించారు. సదస్సులో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయకుమారి, పోలీసు అధికారులు, ప్యానల్ లాయర్లు పాల్గొన్నారు.

నిరంతర వెలుగులు

- గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- నాణ్యమైన విద్యుత్ సరఫరా
- లో ఓల్టేజ్ సమస్యకు చెక్



చినకొండేపూడిలో నెలకొల్పిన విద్యుత్ సబ్ స్టేషన్

సీతానగరం: గ్రామాల్లో నిరంతర విద్యుత్ వెలుగులు వెరజిల్లుతున్నాయి. విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుతో లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం లభించింది. ప్రజల విద్యుత్ సమస్య తీరింది. గతంలో విద్యుత్ సమస్యలతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా పలు గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. దీంతో లో ఓల్టేజ్ సమస్యకు చెక్ పడి, 24 గంటల నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నారు.

విద్యుత్ సమస్యలకు చెక్

వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం విద్యుత్ రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. నియోజకవర్గం ప్రజల ఇబ్బందులు, విద్యుత్ సమస్యలు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టిలో ఉంచి, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు నిధులు రాబట్టి, నియోజకవర్గంలో పలు గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లు నెలకొల్పి, కొన్ని ఇప్పటికే ప్రారంభించారు. మరికొన్ని వివిధ దశలలో ఉన్నాయి. సీతానగరం మండలంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు రూ.5.04 కోట్ల నిధులతో కాటవరం, చినకొండేపూడిలలో విద్యుత్ ఉప కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల పదో తేదీన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వాటిని ప్రారంభించారు. అలాగే రాజానగరం మండలంలో పేవప కాల దిబ్బలో రూ.40.5 కోట్లతో నిర్మించనున్న 220/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని సీఎం జగన్ చేతుల మీదుగా వర్చ్యువల్ (ఆన్‌లైన్) పద్ధతిలో శంకు స్థాపన చేశారు. దీనికి సంబంధించి పనులు త్వరలో ప్రారంభించనున్నారు.

సబ్ స్టేషన్ల ఏర్పాటుతో..

రాజానగరం, కోరుకొండ మండలాల్లోని రాధేయపాలెం, వెలుగుబంద, నరసాపురం లలో ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో 33/11 కేవీ విద్యుత్ కేంద్రాలను నూతనంగా నిర్మించిన సబ్ స్టేషన్లను ఇప్పటికే ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించారు. కొన్ని దశాబ్దాలుగా నియోజకవర్గంలో విద్యుత్ సమస్య ఉన్నా అధికార పార్టీలు ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ సమస్యను పరిష్కరించింది.

అన్ని గ్రామాల్లో వెలుగులు

గ్రామాల్లో సబ్ స్టేషన్లు పూర్తవడంతో రాజానగరం, కోరుకొండ మండలాల్లో లో ఓల్టేజ్ విద్యుత్ సమస్యకు పరిష్కారమైంది. సీతానగరం మండలంలో కాటవరం సబ్ స్టేషన్‌తో కాటవరంతోపాటుగా జాలిమూడి, మునికూడలి, కూనవరం, చినకొండేపూడి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో రఘుదేవపురం, సీతానగరం, చినకొండేపూడి, సింగవరం, చీపురుపల్లి, నాగంపల్లి గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ అందించడమే కాకుండా రైతులు ఎంతగానో ఉపయోగపడుతుంది. దీంతో నియోజకవర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పుడు ఆ సమస్య లేదు



కొన్ని దశాబ్దాలుగా విద్యుత్ సమస్యలతో ఇబ్బంది పడేవాళ్లం. ఎప్పుడ కరెంట్ పోతుండడంతో రాత్రి వేళలో భయపడేవాళ్లం. ప్రభుత్వం విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసి ఎంతో మేలు చేసింది. ఇప్పుడు ఎలాంటి సమస్య లేదు. కరెంట్ సమస్య తీర్చిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు రుణపడి ఉంటాం.

– సూలా సూర్యభాస్కరరావు, సీతానగరం

అంతా ఎమ్మెల్యే రాజా కృషి



విద్యుత్ సమస్యను ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు వివరించగానే వెంటనే స్పందించారు. ఎంతో కృషి చేసి నిధులు తెప్పించారు. ఆయన పట్టించుకోవడం వల్ల విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు అయ్యాయి. దీని వల్ల లో ఓల్టేజ్ సమస్యకు పరిష్కారమైంది. గ్రామాలకు 24 గంటల విద్యుత్ అందుతోంది.

– కూచిమంచి జగన్నాథ రావు, ఉండేశ్వరపురం

లాభాల బాటలో దోసకాయలపల్లి పీఏసీఎస్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మురళి

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లి పీఏసీఎస్ రూ.1.50కోట్లతో లాభాల బాటలో నడుస్తున్నట్టు చైర్మన్ గొల్లవిల్లి మురళి తెలిపారు. ఆయన అధ్యక్షతన సంస్థ కార్యాలయం వద్ద విస్తృతస్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భగా మురళి మాట్లాడుతూ రూ.13.68 కోట్ల టర్నోవర్‌తో సొసైటీ నడుస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి కల్పించిన పలు రాయితీలను అందించామన్నారు. 2022–23 సంవత్సరం గాను 169 మంది రైతులకు రూ.3,34,527 నగదు అందించామని, కేంద్ర ప్రభుత్వం రాయితీని 232 మంది రైతులకు రూ.3,66,212 అందించినట్టు తెలిపారు. సమావేశంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పర్సన్లు గండిబోయిన రాజ్‌కుమార్, నెక్కంటి అప్పారావు సీఈఓ కొయిడాల శివ అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేద్దాం..చంద్రబాబు టీమ్‌ను తరిమికొడదాం!

జోరుగా సాగుతున్న గడప గడపకూ ఎన్నికల ప్రచారం



సీతానగరం ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు

సీతానగరం: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేద్దాం..చంద్రబాబు టీమ్‌ను తరిమి కొడదామని మండల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్థానిక ప్రజలకు వివరిస్తూ మండల గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ధవారం సీతానగరంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, మండల యూత్ అధ్యక్షులు కోలా శ్రీను, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, సలాది వాసు, చింతలపూడి వీరబాబు తదితరులు గడపగడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజవర్గం అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, రాజానగరం నియోజవర్గం అసెంబ్లీ అభ్యర్థి జక్కంపూడి రాజా గెలుపునకు సీలింగ్ ఫ్యాన్‌పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. తోరం పోశియ్య, వలవల సత్తిబాబు, మట్ట మునియ్య, తోరం బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు. రామచంద్రపురంలో పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గద్దె వీరన్నబాబు, జొన్నలగడ్డ గంగరాజు, పిర్ల సుబ్బారావు, కూచిపూడి నాగేశ్వరరావు, చవల సుబ్బారావు, అట్లు పాపారావు తదితరులు గడప గడపకూ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు వేటు వేసి ఎంపీ, ఎమ్మెల్యేను గెలిపించాలని కోరారు. చినకొండేపూడిలో సర్పంచ్ చేరుకూరి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ–1 ముదునూరి సురేష్ రాజు, పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం జోరుగా సాగించారు.

కళామతల్లి ముద్దుబిడ్డ అక్కినేని నాగేశ్వరరావు

- అక్కినేని శత జయంతి ఉత్సవాలు
- ప్రేమాభిషేకం సినిమాకి 43 సంవత్సరాలు

మధురపూడి: తెలుగు సినీమా రంగానికి ప్రపంచంలో ఖ్యాతని తీసుకొచ్చిన అక్కినేని నాగేశ్వరరావు కళామతల్లి ముద్దుబిడ్డని అక్కినేని నాగార్జున ఫాన్సు రాష్ట్ర అధ్యక్షుడు సాలినేని మల్లికార్జునరావు అన్నారు. బూరుగుపూడిలో పల్లెపల్లెకు అక్కినేని శత జయంతి ఉత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యతిధిగా హాజరైన మల్లికార్జునరావు మాట్లాడుతూ అక్కినేని నటించిన ప్రేమాభిషేకం సినిమా 43 సంవత్సరాల వేడకలను కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సినిమా 30 కేంద్రాల్లో విడుదలయ్యి తెలుగు సినీ రంగంలో చరిత్ర సృష్టించిందన్నారు. తొలుత అక్కినేని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సినీ విశ్లేషకుడు అడబాల మరిడయ్య మాట్లాడుతూ తెలుగు సినీ రంగానికి గుండెకాయ లాంటి అక్కినేని లోటు తీరనిదన్నారు. కృష్ణాజిల్లా గుడివాడలో కళాశాలను నిర్మించారన్నారు. ఆయన నటనా చాతుర్యంలోనే కాకుండా, దాతృత్వం లోనూ ముందే ఉన్నారన్నారు. ఈ సందర్భంగా అక్కినేని అభిమాని వృద్ధుడు తమ్మన కృష్ణమూర్తిని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక అభిమానులు కట్టా సూరి, రమేష్, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నాగలత

రంగంపేట: ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని రాజమహేంద్రవరం డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగలత ఆదేశించారు. మండల కేంద్రమైన రంగంపేట పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆమె పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి నెలాఖరుకి 90 శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి పంచాయతీలోనూ ఎన్నికల ఆదర్శ నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. అదేవిధంగా కుళాయి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని కార్యదర్శులకు దిశా నిర్దేశం చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచి నీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రంగంపేట పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు.

కూటమి అభ్యర్థిగా శివరామకృష్ణంరాజు



బిక్కవోలు: అనపర్తి నియోజకవర్గంలో ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా బిక్కవోలు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ములగపాటి శివరామకృష్ణంరాజు ఎంపికయ్యారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను 17 ఏళ్ల పాటు మిలటరీలో ఇంటిలిజెన్స్ విభాగంలో సేవలందించారన్నారు. గత రెండేళ్లగా బీజేపీలో నియోజకవర్గ కన్వీనర్‌గా పనిచేస్తున్నారన్నారు. కూటమిలో భాగస్వాములైన టీడీపీ, జనసేన నాయకులతో కలిసి నియోజకవర్గంలో బీజేపీ విజయానికి కృషి చేస్తారన్నారు. తనకు టికెట్ కేటాయించిన బీజేపీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రధానోపాధ్యాయునికి ఘన సత్కారం



పందలపాకలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక పడాల పెద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చీఫ్ సూపరింటెండెంట్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన బలభద్రపురం ప్రధానోపాధ్యాయుడు సీవీవీ సత్యనారాయణను బుధవారం ఘనంగా సత్కరించారు. మరో మూడు రోజుల్లో ఆయన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో పాఠశాలలో ఉపాధ్యాయులంతా ఆయనకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోనాల సత్తిరాజు మాట్లాడుతూ సత్యనారాయణ ఉద్యోగ జీవితంలో ఎక్కడ పనిచేసినా ఆయా పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారంటూ కొనియాడారు. కార్యక్రమంలో ఇలపల్లి పాఠశాల హెచ్‌ఎం పప్పు శ్రీనివాసరెడ్డి, నాగబాబు, బీవీ నాయక్, వీర్రెడ్డి, యువరాజారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రచారం ప్రారంభం



కోరుకొండలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ నుంచి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తొలుత కోరుకొండలో కొండపైన ఉన్న స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్లపై మోకరిల్లి, ఆధ్యాత్మిక భక్తిని చాటుకున్నారు. అనంతరం కోరుకొండలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి–సంక్షేమ కార్యక్రమాలను చూసి ఫ్యాను గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలందించిన తనను ఆశీర్వదించాలని కోరారు. సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రశ్నిస్తానని పార్టీ పెట్టిన పవన్‌కల్యాణ్ చంద్రబాబు పల్లకీ మోస్తున్నారని విమర్శించారు. బాబును ప్రజలు నమ్మరని గ్రహించి జనసేన, బీజేపీలతో జతకట్టారన్నారు. బీజేపీ విభజన చట్టంలోని హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని దుయ్యబట్టారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అసత్య, నిందారోపణల్లో నిజంలేదన్నారు. సంవత్సరంలో ప్రతిరోజూ 24 గంటలూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేశానన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తుతో సాధించేదేంటన్నారు. 2014 సంవత్సరంలో ఈ పార్టీలు చేసిన మోసాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. రాజానగరం నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేసి, అర్హులందరికీ సంక్షేమ ఫలాలందించడంలో ముందున్నామన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, సేవ చేస్తున్న తనను గెలిపిస్తే ఐదుగురం సేవలందిస్తామన్నారు. ప్రతి గడపకూ తిరిగి సమస్యలు తెలుసుకొని పరిష్కరించినట్టు తెలిపారు. మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి–సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు బాల కుటుంబ సభ్యుల ఆశీర్వాదాన్ని తీసుకున్న ఆయన కోరుకొండలోని పలువురిని కలిసి, ఎన్నికల ప్రచారం చేశారు. నిడిగట్లలో రజకుల ఆరాధన దేవత తలుపులమ్మ వారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి బుల్లియ్యనాయుడు, బొండాడ చందు, కటకం బాబ్జి, బొరుసు భద్రి, వాకా నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

రాఘవపురం, బొల్లెద్దుపాలెంలో గడప గడపకూ

మధురపూడి: కోరుకొండ మండలం రాఘవపురం, బొల్లెద్దుపాలెం గ్రామాల్లో గడప గడపకూ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని బుధవారం వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెల్సుకుంటూ, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, తన కుమారుడు జక్కంపూడి రాజాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అక్రమ, అవినీతి పొత్తులతో ప్రజలను మరోసారి మోసగించడానికి వస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని వ్యతిరేకించాలని కోరారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్టు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి బుధవారం తెలిపారు. వ్యాధి వ్యాప్తి, నివారణ, చికిత్స, వ్యాధిపై సమాజ ధృక్పథం, వైద్య విద్యార్థుల పాత్ర అంశాలపై క్విజ్ పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశామన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య విద్య నేర్చుకోవటంతో పాటు సమాజం పై పూర్తి అవగాహన కలిగిఉండాలన్నారు. కార్యక్రమములో హెచ్‌వోడీ వీవీ దుర్గాప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్లు కేవీ ఫణిమాధవి పాల్గొన్నారు.

ఆలయంలో హోమాలు

కడియం: కడియపులంక గ్రామ దేవత ముసలమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. సింహాచల దేవస్థానం నుంచి విచ్చేసిన వేదపండితుల సమక్షంలో పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తాం

పద్మశాలీ సేవా సంఘం నేతలు



సమావేశంలో పాల్గొన్న పద్మశాలీ సేవా సంఘం సభ్యులు

సీటీఆర్ఐ: పద్మశాలీ సామాజికవర్గానికి కల్యాణ మండపం నిమిత్తం పేపర్‌మిల్లు ఎదురుగా ఆర్‌అండ్‌బీ వర్క్ షాపు సమీపంలో రూ.3 కోట్ల విలువ చేసే 728 గజాల స్థలాన్ని, ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.20లక్షలు అందించిన ఎంపీ భరత్ రామ్‌ను వచ్చే ఎన్నికల్లో రాజమండ్రి సిటీ ఎమ్మెల్యేగా గెలిపించి రుణం తీర్చుకుంటామని పద్మశాలీ సేవా సంఘం నాయకులు జామిశెట్టి గాంధీ, సప్పా ఆదినారాయణ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 6 దశాబ్దాలుగా తమ సామాజికవర్గం తరపున కార్తిక వనసమారాధనలు నిర్వహిస్తూ, ఆ కార్యక్రమానికి అన్ని పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. తమ సంఘానికి సమావేశం నిర్వహించుకోవడానికి కనీసం కార్యాలయం లేదని ఎంతమంది ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ స్పందించలేదన్నారు. గతేడాది కార్తిక వన సమారాధనకు ఎంపీ భరత్ రామ్, రాజమహేంద్రవరం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావులను ఆహ్వానించి తమ కోర్కెను వారి ముందు ఉంచామన్నారు. పద్మశాలీ కల్యాణ మండపానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చిన కొద్ది రోజుల్లోనే స్థలం కేటాయించడంతో పాటు తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.20లక్షలు కేటాయించి, తమ సంఘం అధ్యక్షుడితో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేయించారన్నారు. అలాగే కార్పొరేషన్ తరపున మరో రూ.5 లక్షల నిధులు ఇప్పించడమే కాకుండా, రుడా తరపున మరో రూ.30 లక్షలు మంజూరు చేయించాల్సిందిగా రుడా చైర్మన్ రౌతును కోరుతూ సిఫారస్సు లేఖను అందించామన్నారు. వచ్చే బోర్డు ఎన్నికల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రౌతు స్పందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి డివిజన్‌లోను తమ సంఘం తరపున పర్యటించి భరత్‌కు మద్దతుగా ప్రచారం చేస్తామన్నారు. భరత్ ఎమ్మెల్యేగా, గూడూరి ఎంపీగా విజయం సాధించి తమ పద్మశాలీ సంఘం కల్యాణ మండపాన్ని ప్రారంభించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో ఇమంది కన్నారావు, నందం కుమార్ రాజా, నందం స్వామి, నామాల వెంకటరమణ, జాగు సత్యనారాయణ(వంకాయల సత్తిబాబు), వానపల్లి వెంకటేశ్వరరావు, జి.సత్యనారాయణ, మీసాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.